క్లుప్తంగా

విద్యార్థి చదువుకు సాయం



విద్యార్థికి చెక్కు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మద్దిలపాలెం : ఓ విద్యార్థి చదువుకు కొత్త వెంకోజీపాలెం శ్రీసద్గురు సాయినాథ్ ట్రస్ట్ అండగా నిలిచింది. అనకాపల్లికి చెందిన శరగడం రాధాకృష్ణ సహకారంతో ఇక్కడి సాయినాథ ఆలయంలో పని చేస్తున్న బోర లక్ష్మి కుమారుడు యుగంధర్ చదువు కోసం ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు రూ.15 వేలు చెక్కును శుక్రవారం ఆలయంలో ట్రస్ట్ సభ్యుల సమక్షంలో అందజేశారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్ళి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్ రిటైర్డ్ హెచ్ఎం మృతి



శ్యామల (ఫైల్)

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయిని జి.శ్యామల(89) శుక్రవారం ఉదయం మృతి చెందారు. పాఠశాలలో నవంబరు 1987 నుంచి అక్టోబర్ 1993 వరకు ఇక్కడ పనిచేశారు. వయోభారంతో పీఎంపాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో, విద్యా ప్రమాణాలు పెంపులో ఆమె తనదైన ముద్ర వేసుకున్నారు. ఆమె మృతిపై పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలో కొలువైన రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శనివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు గురుమాత అన్నపూర్ణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నారు. శనివారం కలశ స్థాపన,గోమాత పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 14న వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ,సామూహిక వారాహి సహస్ర నామార్చన పూజలు చేయనున్నట్టు గురుమాత పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం

- అర్జీదారులతో మర్యాదగా మెలగండి
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం
- మూడో పట్టణ పోలీసు స్టేషన్ సందర్శన
- వ్యర్థాలు పేరుకుపోవడంపై ఆగ్రహం



మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బీచ్ రోడ్డు: ఫిర్యాదులను పారదర్శకంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆకస్మాత్తుగా మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను పరిశీలించారు. వ్యర్థాలు పేరుకుపోవడంపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పెండింగ్ కేసులను తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సిబ్బందిని అడిగారు. సిబ్బంది తెలిపిన పలు సమస్యలకు సీపీ తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు. అదే విధంగా సిబ్బందికి కుటుంబ, ఉద్యోగం పరంగా, ఇతర ఏ సమస్యలు ఉన్నా 79950 95799 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద మెలగాలన్నారు. వారిని కూర్చోబెట్టి సమస్యలు వినాలని, వాటిని పారదర్శకంగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సూచించారు. క్రైమ్ పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన, వినియోగంలో లేని వాహనాలను పాడవకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లో పలు విభాగంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సందర్శించిన సీపీ.. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. బ్లూ కోట్స్, ట్రాకోట్స్ పని తీరుపై ఆరా తీశారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను నిత్యం చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గముఖానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. పర్యాటక ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఈ స్టేషన్ పరిధిలో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరగకుండా క్రైం పోలీసులు కృషి చేయాలన్నారు. ఇందు కోసం సీసీ కెమెరాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ ప్రతి కదలికపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి రవాణాపై దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు.

స్క్రాప్ నిల్వలపై జీవీఎంసీ కొరడా

- 12వ వార్డులో స్క్రాప్ షాపు నిర్వాహకుడికి జరిమానా
- తక్షణం తుక్కు నిల్వలు తొలగించాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..



స్క్రాప్ స్టోర్ యజమానికి జరిమానా చలానా అందిస్తున్న సచివాలయం శానిటరీ సెక్రటరీ శేఖర్

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో స్క్రాప్ నిల్వ చేస్తున్న షాపులపై జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. సుందరయ్య కాలనీలో షాపుతో పాటు పలు చోట్ల నివాసాల మధ్య నిర్వహిస్తున్న స్క్రాప్ నిల్వల స్టోర్లతో స్థానికులకు దోమల బెడద ఎక్కువైంది. దీంతో జ్వరాలు, దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. దీనిపై 'స్క్రాప్‌తో పాటు'అనే శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సచివాలయం శానిటరీ సెక్రటరీ శేఖర్ శుక్రవారం సుందరయ్య కాలనీలో స్క్రాప్ షాపును పరిశీలించారు. ఆ షాపు యజమానికి అక్కడ నిల్వ ఉన్న తుక్కును వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. అనధికారికంగా తుక్కు సామాన్లు నిల్వ ఉంచినందుకు రూ.5 వేలు జరిమానా విధించి, దానికి సంబంధించిన రశీదు అందించారు. నిల్వ చేసిన తుక్కును మూడు రోజుల్లో ఖాళీ చేస్తానని ఆ షాపు యజమాని చెప్పడంతో 7వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇదే షాపు నిర్వాహకుడు గెడ్డ అంచున నివాసాలను ఆనుకుని రెవెన్యూకి చెందిన మరో స్థలంలో కూడా అనధికారికంగా నిల్వ చేసిన తుక్కును కూడా వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన జీవనం కోసం సహకారం అవసరం



కాంతి కారంచేటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలోని హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో శుక్రవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఏక ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ కాంతి కారంచేటి అండర్ స్టాండింగ్ డిజెబిలిటీస్–డయాగ్నోసిస్ టు డిస్టెంట్ డ్రీమ్స్ అంశంపై ప్రసంగించారు. వివిధ రకాల డిజెబులిటీస్, చికిత్స విధానాలు, నివారణ అవకాశాలు వివరించారు. కుటుంబ సభ్యులు, పౌర సమాజం అనుకూల దృక్పథంతో మెరుగైన జీవనం అందించడానికి సహకారం అందించాలన్నారు. ఈ సదర్భంగా కాంతి కారంచేటిని విభాగం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, విశ్రాంత ఆచార్యులు జి.పద్దయ్య, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డైటిక్స్ విభాగాల బోధన సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలకు ఆర్‌వో ప్లాంట్ వితరణ



ఆర్‌వో ప్లాంట్‌ను అందజేసిన అధ్యాపకుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆర్‌వో ప్లాంట్‌ను అందజేశారు. ఈ మేరకు ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రేష్ఠమైన తాగునీటి అందించాలనే సదుద్దేశంతో ఆర్వో ప్లాంట్ వితరణ చేయడం అభినందనీయమన్నారు. అధ్యాపకుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయనను కళాశాల సిబ్బంది శాలువా కప్పి సత్కరించారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన



జూ సిబ్బందిని పరీక్షిస్తున్న ఏఎంసీ వైద్య సిబ్బంది

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూనోటిక్ వ్యాధుల గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కళాశాల సహకారంతో 'వన్ వరల్డ్ వన్ హెల్త్, ప్రివెంట్ జూనోసిస్' పేరుతో జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కృష్ణవేణి పాల్గొని జూ యానిమల్ కీపర్లు, సందర్శకులకు జూనోటిక్ వ్యాధులు ఏవిధంగా సంక్రమిస్తాయి, వాటి నివారణ, ఆయా వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర వాటి గురించి వివరించారు. అనంతరం జూ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, జూ వైద్యుడు ఫణీంద్ర, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం



ప్రోత్సాహక బహుమతులతో విద్యార్థులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో శుక్రవారం ×విశాఖ వ్యాలీ విజ్ఞాన వేదిక×కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ద్వారకా ఏసీపీ ఎస్.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైందన్నారు. క్రమశిక్షణ, బాధ్యతతో చదువుకున్నవారే ఉన్నతి స్థాయికి ఎదగగలరన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరిప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలు, విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత గురించి వివరించారు. పిల్లల విద్యకు, స్వేచ్ఛాభావానికి ఎలాంటి ఆటంకం లేని వాతావరణం కలిప్తిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో 100 శాతం విద్య, హాజరు సాధించిన విద్యార్థులకు ఏసీపీ రాంబాబు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

13వ వార్డులో అడిషనల్ కమిషనర్ పర్యటన



13వ వార్డు శివాజీనగర్–2లో గెడ్డను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో శుక్రవారం అదనపు కమిషనర్ విశ్వనాథన్ పర్యటించారు. వార్డులో ఎన్నికల ముందు ప్రారంభమైన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆ పనులు ఎంత శాతం జరిగాయి, ఎప్పటిలోగా పూర్తవుతాయి, తదితర విషయాలను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో గెడ్డల ఆధునికీకరణ కోసం జరుగుతున్న పనులు పరిశీలించారు. ఇంకా ఏయే గెడ్డలను ఆధునికీకరించాలో అడిగి తెలుసుకున్నారు. మిగిలిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు కెల్ల సత్యనారాయణ, జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్ట్ కిశోర్, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీ



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా సమన్వయకర్త రూపావతి తదితరులు

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల్లోని 2024–25 సంవత్సరానికి గాను మిగులు సీట్లు భర్తీకి సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 11 గురుకులాల్లోని బాలబాలికలకు 5వ తరగతిలో మిగులు సీట్లు భర్తీకి లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపావతి అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ప్రవేశాల కోసం హాజరయ్యారు. కార్యక్రమంలో సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణతో పాటు మిగిలిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

కుక్కలతో బెంబేలు

- జోన్–3 కార్యాలయ సెల్లార్‌లో తిష్ట
- భయాందోళనల్లో ఉద్యోగులు, సందర్శకులు



జోన్–3 కార్యాలయం సెల్లార్‌లో కుక్కను పడుతున్న జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 కార్యాలయం సెల్లార్‌లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ సందర్శకులపై దాడులు చేస్తున్నాయి. వీటి బారిన పడి పలువురు గాయాల పాలయ్యారు. తాజాగా గురువారం ఒక వ్యక్తి జోనల్ కార్యాలయానికి వచ్చాడు. సెల్లార్‌లో కుక్కలు అతడిని కరవడంతో భయాందోళనలు చెంది పరుగులు తీశాడు. శుక్రవారం జోనల్ కార్యాలయం సెల్లార్‌లో కుక్కలను జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది పట్టుకున్నారు. అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి దాటిన తరువాత వెళ్లే వారిని శునకాలు వెంటపడి తరుముతున్నాయి. దీంతో రాత్రి పూట విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కుక్కల అరుపులతో స్థానికులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. పలు వీధుల్లో ఎక్కడో ఒక చోట కుక్క కాటుకు గురవుతున్నారు. గుంపులుగా స్వైర విహారం చేస్తుండటంతో రోడ్డు మీదకు వచ్చేందుకు జనం బెంబేలెత్తుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

పరిశుభ్రత అందరి బాధ్యత



ఎంవీపీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో శుక్రవారం స్వచ్ఛ పఖ్వాడా ర్యాలీ నిర్వహించారు. సమత డిగ్రీ, పీజీ కళాశాల, వీఎంసీ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ముందుగా ఈ ర్యాలీని వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, సమత కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ పరిశుభ్రత అందరి బాధ్యత కావాలన్నారు. ఇందుకు ఉన్నత విద్యా సంస్థల నుంచి నాంది పలకాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో చైతన్యం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. వాతావరణం పరిరక్షించడం, శుభ్రత ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యవంతమైన విద్యతో ఉద్యోగావకాశాలు



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

దాబాగార్డెన్స్ : నైపుణ్యంతో కూడిన విద్యనభ్యసిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ), మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా జెన్‌ప్యాక్ట్ పేరిట శుక్రవారం జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జెన్‌ప్యాక్ట్ కంపెనీ సీనియర్ మేనేజర్లు సతీష్, శ్యాంసన్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ అధికారి రాజేష్ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 256 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో 70 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డి. అరుణపద్మ, విద్యాకల్పన, హైమావతి, సంతోషి, అనూష, డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని శుక్రవారం గీతం ప్రొఫెసర్ డి.హరినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీకి విలువైన వేద పుస్తకాలను బహూకరించారు. రుగ్వేదం 12 భాగాలు, యజుర్వేదం 3 భాగాలు, సామవేదం 2 భాగాలు, అదర్వణ వేదం 5 భాగాలు మొత్తం 22 పుస్తకాలను గ్రంథాలయం కార్యదర్శి వర్మకు అందజేశారు.